క్లుప్తంగా

టీ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా రాము



వీపనగండ్ల: టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన మీసాల రామును నియమించారు. ఇందుకు సంబంధించిన నియామకపత్రాన్ని వ్యవస్థాపక అధ్యక్షుడు ఇసుక రాజు, రాష్ట్ర అధ్యక్షుడు బాలరాజు చేతుల మీదుగా అందుకున్నట్లు నూతనంగా ఎంపికైన రాము తెలిపారు. గ్రామాల్లో దళిత కులస్తులు ఆర్థికంగా ఎదిగేందుకు తమవంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా రాము తెలియజేశారు.

జిల్లా ఉపాధ్యక్షుడిగా తిరుపతయ్యగౌడ్



వనపర్తి రూరల్: బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా కడుకుంట్లకు చెందిన తిరుపతయ్యగౌడ్ నియమితులయ్యారు. ఆయన ఆదివారం హైదరాబాద్‌లో జాతీయ బీసీ సంక్షేమ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నట్లు తిరుపతయ్యగౌడ్ తెలియజేశారు.

విద్యార్థినికి సన్మానం



కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలోని 14వ వార్డుకు చెందిన నిక్సన్, చంద్రకళ దంపతుల కుమార్తె షైనీ ఉన్నత చదువులు చదివేందుకు ఈ నెల 20న లండన్ వెళ్తున్నందున స్థానిక కాలనీవాసులు షైనీనికి అంబేడ్కర్ చిత్రపటాన్ని అందజేసి పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. జెఎస్ఆర్ ఫౌండేషన్ నిర్వాహకులు సతీష్‌రాజ్, కర్ణకుమార్, సంపత్‌కుమార్, రాజు, యం.ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి అండగా ఫొటోగ్రాఫర్లు



గోపాల్‌పేట: మండల కేంద్రంలో గత శనివారం పోలీస్‌స్టేషన్ ఎదుట ఉన్న ప్రసాద్ ఫొటో స్టూడియోలో షార్ట్‌సర్క్యూట్ జరిగి దుకాణంలోని జిరాక్స్ మిషన్లు, ల్యామినేషన్ మిషన్, కంప్యూటర్, ఇతర వస్తువులు కాలిపోయాయి. విషయం తెలుసుకున్న కొల్లాపూర్ ఫొటోగ్రాఫర్స్, వీడియో గ్రాఫర్లు అండగా నిలిచారు. మూడు రోజుల కిందట కొల్లాపూర్‌కు చెందిన కట్టశ్రీనివాస్ ఆధ్వర్యంలో గోపాల్‌పేటలోని ఫొటో స్టూడియోను సందర్శించి పరిశీలించారు. అనంతరం ఆర్థిక సాయం అందజేశారు. ఆదివారం కొల్లాపూర్, గద్వాల, జడ్చర్లకు చెందిన వారు గోపాల్‌పేటలో ప్రసాద్‌ను పరామర్శించారు. జడ్చర్ల ఫొటోగ్రాఫర్ల యూనియన్ అధ్యక్షుడు కళ్యాణ్ ప్రసాద్‌కు 6 డీ కెమెరాను ఇచ్చారు.

బీసీఎఫ్ జిల్లా కమిటీ ఎన్నిక

వనపర్తిటౌన్: బీసీ ఫెడరేషన్ జిల్లా కమిటీని ఆదివారం జిల్లా కేంద్రంలో రాష్ట్ర కన్వీనర్ చెన్న రాములు, రాష్ట్ర మహిళా విభాగం కన్వీనర్ ఎస్. నాగమ్మల ఆధ్వర్యంలో ఏకగ్రీవకంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా రెండో గుంటి కురుమూర్తి, ప్రధాన కార్యదర్శిగా తిరుపతయ్య యాదవ్, ఉపాధ్యక్షులుగా జానంపేట లీలావతి, బాలస్వామి, మాజీ ఎంపీటీసీ మిద్దె కృష్ణ, కోశాధికారిగా ఎస్. చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శులుగా వాకిటి రాజమౌళి, అవినాష్, కృష్ణ, కాసీం, జిల్లా కమిటీ సభ్యులుగా ఉందేకోటి అంజి, మహేష్ యాదవ్, బండలయ్య, సుధాకర్, విజయ్ కుమార్, అంజిలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా చెన్న రాములు మాట్లాడారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీలకు 42శాతం రిజర్వేషన్ జీఓ విడుదల చేసిన అనంతరం, స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. బీసీలకు చట్టసభల్లో జనాభా దామాషా ప్రకారం రాజకీయ రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు.

కేసు నమోదు

వనపర్తి రూరల్: పెబ్బేరు మండల కేంద్రంలో వినాయకుల నిమజ్జనం దృష్టిలో పెట్టుకొని ఆదివారం పట్టణంలో వైన్‌షాపులు బంద్ చేశామని ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. పెబ్బేరు పట్టణంలో ఎస్సీ కాలనీలో కృష్ణ మద్యం అమ్ముతున్నాడని సమాచారం మేరకు దుకాణంపై దాడి చేయగా 4 బీర్లు, మందు పట్టుబడిందన్నారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న కృష్ణపై కేసు నమోదు చేశామని ఎస్ఐ వివరించారు.

అందని బిల్లులు



ఖిల్లాఘనపురం బాలుర ఉన్నత పాఠశాలలో నిర్మించిన అదనపు తరగతి గదులు

- ఆందోళనలో కాంట్రాక్టర్లు
- కొత్త ప్రభుత్వం వచ్చి నాలుగు నెలలైనా విడుదల కాని నిధులు
- ఖిల్లాఘనపురం మండలంలో 'మన ఊరు మన బడి' మొదటి విడతలో 15 పాఠశాలలు ఎంపిక



ఖిల్లాఘనపురం మండలం అప్పారెడ్డిపల్లి లో పూర్తయిన డైనింగ్ హాల్ నిర్మాణం

ఖిల్లాఘనపురం: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని చేపట్టిన 'మన ఊరు మన బడి' పథకంలో చేపట్టిన పనులకు బిల్లులు రాక కాంట్రాక్టర్లు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు గాను తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో విడతల వారీగా పాఠశాలలను ఎంపిక చేసి అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. కాని మొదటి విడతలో చేపట్టిన పనులకు ఇప్పటివరకు పూర్తిస్థాయిలో బిల్లులు రాకపోవడంతో పనులు చేసిన వారు కొత్త ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తుందా అంటూ ఆశగా ఎదురుచూస్తున్నారు.

15 పాఠశాలలు ఎంపిక..

తెలంగాణ ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధి కోసం తీసుకొచ్చిన 'మన ఊరు మన బడి' పథకంలో మొదటి విడతలో ఖిల్లాఘనపురం మండలంలో 15 పాఠశాలలను ఎంపిక చేశారు. అందులో మూడు ఉన్నత పాఠశాలలు, రెండు ప్రాథమికోన్నత పాఠశాలలు, 10 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో ఇప్పటి వరకు మొత్తం 10 పాఠశాలల్లో పనులు పూర్తి చేశారు. మరో 5 పాఠశాలల్లో 80 శాతం పనులు పూర్తయ్యాయని ఏఈ తెలియజేశారు.

కాంట్రాక్టర్ల ఆందోళన..

మండలంలో 15 పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, గోడల మరమ్మతు తదితర పనులు చేసేందుకు గాను ప్రభుత్వం మొత్తం రూ.4.50 కోట్ల నిధులు మంజూరు చేసింది. కాని ఇప్పటివరకు పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు రూ.2.21 కోట్ల బిల్లులు మాత్రమే అందాయని తెలిపారు. మిగతా బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత బిల్లులు వస్తాయని ఆశిస్తున్నారు.

బిల్లులు చేసి ప్రభుత్వానికి పంపించాం..



మండలంలో మొత్తం 15 పాఠశాలల్లో 'మన ఊరు– మన బడి' పనులు చేపట్టారు. ఉప్పరిపల్లిలో స్థలం విషయంలో తగాదాలు రావడంతో పనులు చేపట్టలేదు. మిగతా పాఠశాలల్లో పనులు చివరి దశకు వచ్చాయి. ఇప్పటి వరకు మొత్తం రూ.2.21 కోట్ల బిల్లులు వచ్చాయి. మిగతా పనులకు సంబంధించి బిల్లులు చేసి ప్రభుత్వానికి పంపించాం. నిధులు విడుదలైన వెంటనే పనులు చేపట్టిన వారికి అందజేస్తాం.

– సాయిరెడ్డి, విద్యాశాఖ ఏఈ, ఖిల్లాఘనపురం

గంగమ్మ ఒడికి ఏకదంతుడు



అమరచింతలో మహంకాళి శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న గణేశ్‌నగర్ యువకులు



అమరచింతలో నిమజ్జనానికి తరలుతున్న వినాయకులు

వీపనగండ్ల: గణేష్ ఉత్సవాల్లో భాగంగా తొమ్మిది రోజులపాటు ప్రత్యేక పూజలు అందుకున్న గణనాథుడిని ఆదివారం గ్రామంలోని పురవీధుల వెంట శోభయాత్ర నిర్వహించిన అనంతరం గ్రామ సమీపంలోని ఊర చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో బాబురెడ్డి, లోకారెడ్డి, కార్తీక్, మోక్షన్య, రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు, అన్నదానాలు

పాన్‌గల్: మండల కేంద్రంలోని యాదవ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని వద్ద మంగదొడ్డి శ్రీనివాసులు యాదవ్, వివేకానంద యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని వద్ద మంగదొడ్డిరాజు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. మరికొన్ని గ్రామాల్లో ప్రత్యేక పూజల అనంతరం నిమజ్జనానికి తరలించారు.

అన్నప్రసాదం దాతకు సత్కారం

అమరచింత: పట్టణంలోని బీసీ కాలనీలోని వినాయక మండపాలతో పాటు మరికొన్ని వార్డుల్లో కొలువు దీరిన వినాయక మండపాల వద్ద అన్నప్రసాద వితరణ కోసం నగదును అందించిన ప్రముఖ జరీచీరల వ్యాపారీ మహంకాళి శ్రీనివాస్‌ను మండప నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కొన్ని సంవత్సరాలుగా వినాయక విగ్రహాల కోసం ఆర్థిక సహకారం అందించడంతో పాటు అన్నప్రసాదం, లడ్డు ప్రసాదాలకు తన సొంత డబ్బులను వెచ్చించి మండప నిర్వాహకులకు సహకారం అందించడం సంతోషంగా ఉందన్నారు. గణేష్ మండపాలను దర్శించిన నిర్వాహకులు మహంకాళి శ్రీనివాస్‌ను శాలువా, వినాయక పటంతో అభినందించారు. కార్యక్రమంలో గాజుల వెంకటేష్, క్యామ శ్రీను, మహంకాళి నరేందర్, చిన్న సీతారాములుతో పాటు పలువురు పాల్గొన్నారు.



పాన్‌గల్ యాదవ యూత్ వినాయకుడి వద్ద పూజలో పాల్గొన్న భక్తులు

రికార్డు స్థాయిలో లడ్డూ వేలం

వనపర్తి రూరల్: మర్రికుంట వినాయకుడి లడ్డూను చీర్ల గాలెమ్మ తిరుమలయ్య వారసులు ఆదివారం వేలం ద్వారా రూ.1.50 లక్షలకు కైవసం చేసుకున్నారు. వనపర్తి పట్టణంలో రికార్డు నెలకొల్పారు.

అమరచింత: పట్టణంలోని రవీంద్రనగర్‌లో వినాయకుడి ఎదుట చిన్నారులు పాల ఉట్లు కొట్టి గణేష్ నిమజ్జనంలో పాల్గొన్నారు. శివాజీ నగర్, రాణాప్రతాప్ నగర్, జగన్‌వాడ, గణేష్ నగర్, తిరుమల వీధులతో పాటు పలు వార్డుల్లో కొలువు దీరిన వినాయకులను నిమజ్జనానికి తరలించారు.

ఆధునిక నిర్మాణాల్లో ఇంజినీర్ల పాత్ర కీలకం



ఇంజినీర్లను సన్మానిస్తున్న నిర్వాహకులు, సీనియర్ ఇంజినీర్లు



విశ్వేశ్వరయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కవులు, నాయకులు

వనపర్తి: ఆధునిక వినూత్న నిర్మాణాల్లో ఇంజినీర్ల పాత్ర అతి ముఖ్యమైందని సీనియర్ ఇంజినీరు సుభాష్ గౌడ్ అన్నారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక లక్ష్మీకృష్ణ హాల్‌లో గురురాఘవేంద్ర ట్రేడర్స్, టాటా స్టీల్స్, భారతీ సిమెంట్, బార్గర్ పేయింట్ డీలర్ మోహన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇంజినీర్స్ డే కార్యక్రమానికి పలువురు సీనియర్ ఇంజినీర్లు, పాలిటెక్నిక్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ కుమారస్వామి, మున్సిపల్ ట్రేడ్ లైసెన్స్ హోల్డర్స్ హాజరయ్యారు. ఇంజినీర్లకు ఆదిగురువుగా చెప్పుకొని విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని కేక్ కట్ చేసి ఆయన సృష్టించిన అద్భుతాలను గుర్తు చేసుకున్నారు. ఆయన పుట్టుక, ఆయన్ను పెంచిన కుటుంబం, పెరిగిన వాతావరణం, చదువుకున్న విధానం, ఇంజినీర్‌గా ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఇర్మాన్‌ఖాన్, పాండు, ఉదయ భాస్కర్‌రెడ్డి, అఖీం, తదితరులు పాల్గొన్నారు. వారిని నిర్వాహకులు శాలువాలు, పూలమాలలతో సత్కరించారు.

వనపర్తిటౌన్: మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఇంజినీరింగ్ విభాగంలో చేసిన ఘనతలకు గుర్తింపుగా ఆయన జయంతిని ఇంజినీర్స్ డేగా జరుపుకోవడం ఎంతో గర్వకారణంగా ఉందని మహనీయుల స్ఫూర్తి వేదిక రాష్ట్ర చైర్మన్ రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య 163వ, జయంతిని మహనీయుల స్ఫూర్తి వేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ మేరకు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. నీటి పారుదల పితామహుడు విశ్వేశ్వరయ్య అని, హైదరాబాద్ మూసీ నది వరదల నుంచి రక్షించడానికి రూపొందించాడని గుర్తుచేశారు. కార్యక్రమంలో కవులు, నాయకులు గిరిరాజాచారి, డాక్టర్ నాయకంటి నరసింహ శర్మ, గంధం నాగరాజు, మండ్ల దేవన్న నాయుడు, బాలస్వామి నాయుడు, బండలయ్య, బాలేమియా పాల్గొన్నారు.

స్నేహితురాలికి ఆర్థిక సాయం



మోజర్లలో స్నేహితురాలికి ఆర్థిక సాయం అందజేస్తున్న చిన్ననాటి స్నేహితులు

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని మోజర్ల–మద్దిగట్ల జెడ్పీహెచ్ఎస్‌లో 2004లో 10వ తరగతి చదివిన వడ్డె కవిత భర్త వడ్డె చంద్రాయుడు అనారోగ్యంతో బాధపడుతూ.. ఇటీవల మృతిచెందాడు. విషయం తెలుసుకున్న తోటి స్నేహితులు కలిసి చేతనైనంత సాయాన్ని అందించాలని నిర్ణయించుకున్నారు. తోటి స్నేహితులందరూ రూ.50 వేలు సేకరించారు. అలా జమచేసిన మొత్తాన్ని ఆదివారం మోజెర్లలోని వడ్డె కవిత ఇంటికి వెళ్లి నగదును అందజేశారు. కార్యక్రమంలో రాణి, రాధ, రాజేశ్వర్‌రెడ్డి, బస్వరాజ్, రాఘవేంద్ర పాల్గొన్నారు.

అమడబాకులలో..

కొత్తకోట మండలంలోని అమడబాకులలో మల్లేష్ మూడేళ్ల కుమారుడు అనారోగ్యంతో మృతిచెందాడు. అదేవిధంగా బుడగజంగం లచ్చమ్మ(55) అకస్మాతుగా మృతి చెందింది. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు ఆకుల రాములు యాదవ్ మృతుల ఇళ్లకు వెళ్లి మృతదేహాలపై పూలమాలలు వేసి నివాళి అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుల కుటుంబాలకు వేర్వేరుగా రూ.5 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు.

పంట రుణాలు ఇవ్వాలని వినతి

వనపర్తి రూరల్: వనపర్తి జిల్లాలో లావనీ పట్టా భూముల(అసైన్డ్ భూమి)కు పట్టాలు, పాస్‌బుక్ ఉన్న రైతులకు పంట రుణాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీరామ్ డిమాండ్ చేశారు. ఆదివారం వనపర్తి జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. లావనీ పట్టా భూములు ఉన్న చాలా మంది రైతులు గతంలో సింగిల్ విండోల ద్వారా పంట రుణాలు తీసుకోగా.. ప్రభుత్వం ఇటీవల రుణమాఫీ చేసిందన్నారు. మాఫీ అయిన రైతులకు మళ్లీ కొత్త రుణాలు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించినా.. లావనీ, అసైన్డ్ భూములకు సింగిల్ విండోలో వానాకాలం పంట రుణాలు ఇవ్వడం లేదన్నారు. పాన్‌గల్, రాజనగరం, వనపర్తి సింగిల్‌విండో అధికారులను అడిగితే డీసీసీబీలు లావనీ భూములకు పంట రుణాలు ఇవ్వడం లేదని చెబుతున్నారని అన్నారు. రుణాలు ఇవ్వకుంటే ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ నాయకులు జి.రమేష్, గోపాలకృష్ణ, మహేష్, లక్ష్మీనారాయణ, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

సాయుధ పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి



ఏదుట్లలో సీపీఐ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

గోపాల్‌పేట: తెలంగాణలో ప్రజా పోరాటాలకు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరాం పిలుపునిచ్చారు. గోపాల్‌పేట మండలం ఏదుట్లలో ఆదివారం తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జెండాను ఆవిష్కరించారు. రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మగ్దుం మోహినుద్దీన్ దొడ్డికొమురయ్య, చాకలిఐలమ్మ వంటి పోరాట యోధుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి రమేష్, గోపాలకృష్ణ, ఎత్తం మహేష్, లక్ష్మీనారాయణ, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

విలీన దినాన్ని అధికారికంగా నిర్వహించాలి

వీపనగండ్ల: తెలంగాణ సాయిధ పోరాటంలో అనేక మంది ప్రాణ త్యాగాలు చేయడంతోనే తెలంగాణకు విముక్తి లభించిందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీరాం, గోపాల్ అన్నారు. సెప్టెంబర్ 17న తెలంగాణ విలీన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఐ జిల్లా నాయకులు మండల కేంద్రంతో పాటు బొల్లారం గ్రామాల్లో తెలంగాణ వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో గోపాలకృష్ణ, శ్రీనివాసులు, నర్సింహ, లక్ష్మీనారాయణ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ సౌకర్యం కల్పించాలి

వనపర్తి రూరల్: భవన నిర్మాణ రంగ కార్మికులకు పెన్షన్ సౌకర్యం కల్పిస్తూ.. ఇన్సూరెన్స్, పరికరాలను సంక్షేమ బోర్డు ద్వారానే కొనసాగించాలని తెలంగాణ ప్రగతిశీల భవన నిర్మాణ సంఘం గ్రామ అధ్యక్షుడు భరత్ ఆధ్వర్యంలో ఆదివారం కడుకుంట్లలో భవన నిర్మాణ కార్మికులతో కలిసి దేవాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్మిక సంఘాల పోరాటాల ఫలితంగా సంక్షేమ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయన్నారు. భవన నిర్మాణ రంగ కార్మికుల సమస్యల సాధనకు ఈ నెల 18న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్మిక వర్గం అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

సెల్‌ఫోన్ అప్పగింత

వనపర్తి రూరల్: పెబ్బేరు మండలం కంచిరావుపల్లికి చెందిన సుజాత మూడు నెలల కిందట సెల్‌ఫోన్ పోగొట్టుకున్నట్లు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్ ఆచూకిని గుర్తించి స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలియజేశారు. ఆదివారం పెబ్బేరు పోలీస్‌స్టేషన్‌లో బాధితురాలు సుజాతకు ఫోన్ అప్పగించామన్నారు. సెల్‌ఫోన్లు చోరీకి గురైనా.. లేదా పోగొట్టుకున్న సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వివరాలను పొందుపర్చాలని ఎస్ఐ సూచించారు.

సీసీ రోడ్లు నిర్మించాలి

వీపనగండ్ల: గ్రామంలోని పలుకాలనీల్లో సీసీ రోడ్లను నిర్మించాల్సి ఉందని అందుకు రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారాన్ని తీసుకుంటామని కల్వరాళ్ల కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు నర్సింహ, మాజీ ఉపసర్పంచ్ ఉస్సేన్ అన్నారు. ఆదివారం గ్రామంలో ఎస్సీ కాలనీలో నిర్మించాల్సిన ప్రధాన వీధులను వారు సందర్శించారు. గ్రామాభివృద్ధిలో రాజకీయాలను పక్కనపెట్టి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు.

టీపీసీసీ చీఫ్‌ను కలిసిన ఎమ్మెల్యే



వనపర్తి: టీపీసీసీ అధ్యక్షుడిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన మహేష్ కుమార్‌గౌడ్‌ను ఆదివారం గాంధీ భవన్‌లో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన కార్యాచరణ, నూతన కార్యవర్గాల ఏర్పాటుపై చర్చించారు. అనంతరం టీపీసీసీ చీఫ్‌ను శాలువా, పూలమాలతో సత్కరించారు.

మైనార్టీ నాయకుడికి పరామర్శ

పాన్‌గల్: మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు ఇలీయాస్‌ను ఆదివారం మంత్రి జూపల్లి తనయుడు, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు జూపల్లి అరుణ్ పరామర్శించారు. మైనార్టీ నాయకులు ఇటీవల రంపంతో కట్టెలు కోసే క్రమంలో ప్రమాదవశాత్తుతో గాయపడిన విషయం తెలుసుకున్న ఆయన, ఇంటికి వెళ్లి పరామర్శించి జరిగిన సంఘటన, ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అంతకు ముందు స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలోని రాఘవేందర్‌యాదవ్ నూతనంగా ఏర్పాటు చేసిన 'దర్బార్ టీ కేఫ్'ను జూపల్లి అరుణ్ ప్రారంభించి ప్రత్యేక పూజలు చేశారు. రవికుమార్, వెంకటేష్‌నాయుడు, హైమావతి, గోవర్ధన్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

'ధర్మం గెలిచిన సభ' వాల్‌పోస్టర్ విడుదల

అమరచింత: ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ ఉపవర్గీకరణకు 1994 నుంచి ఎమ్మార్పీఎస్ సంఘాల ఆధ్వర్యంలో నేటివరకు ఎన్నో పోరాటాలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వ సహకారంతో సుప్రీంకోర్టు తీర్పు ద్వారా ఎస్సీ ఎస్టీ వర్గీకరణకు మోక్షం లభించిందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు విజయ్ తెలిపారు. ఈ మేరకు ఈ నెల 24న మహబూబ్‌నగర్‌లోని అంబేడ్కర్ కళాభవనంలో నిర్వహించే 'ధర్మం గెలిచిన సభ' కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమం విజయవంతం చేయడానికి ప్రతిఒక్కరూ తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కిన్నెర మహేందర్, అర్జున్ కుమార్, చంద్రశేఖర్, కురుమన్న, గోపాల్, భాస్కర్ పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నాస్తిక అధ్యయన తరగతులకు తరలిన నాయకులు

అమరచింత: శాస్త్రీయ అధ్యయనం భావవాదం భావాజాలంపై ఆదివారం హైదరాబాద్‌లోని హిమాయత్ నగర్‌లో నిర్వహించే నాస్తిక అధ్యయన తరగతులకు పట్టణం నుంచి నాస్తిక సమాజం నాయకులు ఆదివారం బయలుదేరారు. హైదరాబాద్‌లోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఒకరోజు నాస్తిక అధ్యయన సమావేశం నిర్వహిస్తున్నారని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు భాస్కర్ తెలిపారు. అధ్యయన తరగతుల్లో నాస్తిక వాదం, మూఢనమ్మకాలు, భౌతిక భావవాదాలపై ప్రముఖులు ప్రసంగిస్తారన్నారు. హైదరాబాద్‌కు తరలిన వారిలో విజయరాములు, భక్తరాజు, లక్ష్మీనారాయణ, రవీందర్, కుతుబ్, రఘు తదితరులు ఉన్నారు.



అమరచింత నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న నాస్తిక సమాజం నాయకులు

ఘనంగా మిలాద్- ఉన్- నబీ ఉత్సవాలు



ప్రార్థనలో పాల్గొన్న భక్తులు

అమరచింత: మహ్మద్ ప్రవక్త జయంతిని పురస్కరించుకుని మిలాద్– ఉన్–నబీ ఉత్సవాలు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. శనివారం రాత్రి గంధోత్సవంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయని మసీద్ కమిటీ అధ్యక్షుడు ఆయూబ్‌ఖాన్ తెలిపారు. ఆదివారం నబీసాబ్ మసీదులో పిండివంటలతో పాటు పాయసాన్ని నైవేద్యంగా భక్తులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ప్రార్థనలు చేశారు. సోమవారం ఆసర్ ముబారక్ ద్వారా మహ్మద్ ప్రవక్తకు సంబంధించిన కేశాలను ప్రదర్శనగా ఉంచుతున్నట్లు వెల్లడించారు.

పెబ్బేరులో రక్తదాన శిబిరం



పెబ్బేరులో రక్తదానం చేస్తున్న మైనార్టీ నాయకులు

వనపర్తి రూరల్: మిలాద్–ఉన్–నబి సందర్భంగా ఆదివారం మసీద్ ఏమూస యూత్ కమిటీ ఆధ్వర్యంలో పెబ్బేరు పట్టణంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదాన శిబిరానికి ముఖ్యఅతిథిగా పాల్గొని శిబిరాన్ని ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. ఈ శిబిరంలో 30 యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడారు. సేవాగుణంతో కులమతాలకు అతీతంగా మంచి కార్యక్రమాలు చేపట్టి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. దేశ అభివృద్ధికి కులమతాలకి అతీతంగా ఎంతో మంది సేవ చేసి పేరు సంపాదించుకున్నారని, యువత కూడా దేశాభివృద్ధికి సమాజ శేయస్సుకు పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో ఎండీ అఫ్రోజ్, మతీన్, ఖుద్దుస్,జానీ, అర్బాబ్, మోయినుద్దీన్, బురాన్, బాషా, నయ్యూం తదితరులు పాల్గొన్నారు.